క్లుప్తంగా

దేవమ్మవ్వ విగ్రహ ప్రతిష్ఠ



నూతనంగా నిర్మించిన దేవమ్మవ్వ ఆలయం

నందవరం : మండల కేంద్రంలో వెలసిన దేవమ్మకు విశేష పూజలు నిర్వహించారు. నూతనంగా ఆలయ నిర్మాణంతో పాటు దేవమ్మ అవ్వ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. సోమవారం అమ్మ వారికి ప్రత్యేక అలంకరణ పూజలు గావించారు. ఇంటింటి నుంచి పిండి వంటలను నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మొక్కుబడిలో భాగంగా గ్రామస్తులు దేవమ్మకు గజ మాలలు సమర్పించారు.

రోడ్డు పనుల పరిశీలన



పట్టణంలోని కలుగొట్ల రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని ఎంబీ చర్చి నుంచి కలుగొట్ల రోడ్డు నిర్మాణ పనులను ఎట్టకేలకు మున్సిపల్ అధికారులు సోమవారం ప్రారంభించారు. ఆయా పనులను మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పరిశీలించి పనులు వేగవంతం చేయాలని కాంట్రాక్టర్‌కు, ఇంజనీరింగ్ అధికారులను సూచించారు. అనంతరం సోగనూరు రోడ్డులో కల కంపోస్ట్ యార్డ్‌ను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈలు విక్టర్, రాజునాయక్, ఏఈ మదన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివి



గోనెగండ్లలో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

గోనెగండ్ల : విధి నిర్వహణలో పోలీస్ అమరవీరుల త్యాగాలు మరువలేనివని సీఐ గంగాధర్ అన్నారు. పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా సీఐ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి పోలీసులు ర్యాలీ నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ విధి నిర్వహణలో అశువులు బాసిన పోలీసుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు.

ఎల్ఐసీ ఏజెంట్ల అభ్యున్నతికి కృషి

ఎమ్మిగనూరుటౌన్: ఎల్ఐసీ ఏజెంట్ల అభ్యున్నతికి కృషి చేస్తామని భారతీయ లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్ల సంఘ సౌత్ సెంట్రల్ జోన్ కోశాధికారి సత్యనారాయణరెడ్డి, బీఎంఎస్ రాష్ట్ర నాయకుడు మహదేవప్ప అన్నారు. సోమవారం ఎల్ఐసీ సమావేశ భవనంలో బీఎల్ఐఏఎస్ ఆధ్వర్యంలో ఎల్ఐసీ ఏజెంట్ల సమావేశం జరిగింది. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఎమ్మిగనూరు బ్రాంచ్ కన్వీనర్‌గా రామాంజినేయులు, కోశాధికారిగా కృష్ణారెడ్డి, కడప డివిజన్ కన్వీనర్‌గా ఎన్.నరసింహులు, జిల్లా కన్వీనర్‌గా దొడ్డిమేకల వెంకటేశ్వర్‌రెడ్డి, సౌత్ సెంట్రల్ జోన్ కన్వీనర్‌గా ఎన్.రంగస్వామిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇందులో భాగంగా పలు సమస్యలపై బ్రాంచ్ మేనేజర్‌కు వినతిపత్రం ఇచ్చారు.


ఎల్ఐసీని నిర్వీర్యం చేసే కుట్ర

ఆదోని సెంట్రల్: దేశంలోనే అత్యంత పేరుగాంచిన సంస్థ ఎల్ఐసీని నిర్వీర్యం చేసే కుట్ర జరుగుతోందని లియాఫీ నాయకులు జయభారత్ రెడ్డి, శంకరయ్య గుప్త, సిద్ధలింగ, రఫిక్ తెలిపారు. సోమవారం ఏజెంట్ల సమస్యల పరిష్కారానికి భోజనం విరామ సమయంలో ధర్నా నిర్వహించారు.

స్కూల్ గుర్తింపును రద్దు చేయండి

ఎమ్మిగనూరుటౌన్: ఫీజు కట్టలేదని ఓ విద్యార్థినిని పాఠశాల నుంచి గెంటివేసిన పట్టణంలోని గుడ్‌బేస్ స్కూల్ గుర్తింపును రద్దు చేయాలని ఆర్‌వీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవీంద్రనాథ్, జిల్లా అధ్యక్షుడు నాగరాజు కోరారు. ఈమేరకు సోమవారం డీఈఓ శ్యాముల్‌కు వినతి పత్రం ఇచ్చారు.

నిరుద్యోగులకు జాబ్ మేళా



మాట్లాడుతున్న కరస్పాండెంట్ మురళీబాబు

ఆదోని సెంట్రల్: పట్టణంలోని జ్యోతిర్మయి డిగ్రీ కళాశాలలో నిరుద్యోగ యువతీ యువకులకు జాబ్‌మేళా నిర్వహించారు. సోమవారం కళాశాలలో ఏర్పాటు చేసిన మెగా జాబ్‌మేళా కార్యక్రమాన్ని కళాశాల కరస్పాండెంట్ మురళీబాబు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. మేళాలో దాదాపు 30 కంపెనీలలో వెయ్యి మందికిపైగా ఉద్యోగ అవకాశాలను కల్పించడానికి ఈ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మానవ వనరుల అధికారులు చంద్రశేఖర్ ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగాలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రెసిడెంట్ రఘురామయ్య, కళాశాల ప్రిన్సిపాల్ స్వామినాథ్ తదితరులు పాల్గొన్నారు.

అగ్రి'కల్చర్'మారుతోంది

సంప్రదాయ సాగుకు సాంకేతికత తోడవుతోంది. పుడమినే నమ్ముకున్న రైతన్నకు సాగుపై ఆలోచనలు మారుతున్నాయి. ఫలితంగా వ్యవసాయరంగంలో వినూత్న మార్పులు చోటుచేసుకుంటున్నాయి. అన్నదాతలు నూతన వ్యవసాయ పద్ధతులు, యాంత్రీకరణ వైపు మొగ్గు చూపుతుడటంతో అగ్రి 'కల్చర్ 'లో మార్పులు మొగ్గతొడుగుతున్నాయి.

- వ్యవసాయంలో పెరుగుతున్న యాంత్రీకరణ
- దుక్కి మొదలు నూర్పిడి వరకు యంత్రాలతోనే
- తగ్గుతున్న సమయం, వ్యయప్రయాసాలు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సబ్సిడీపై యంత్రాల పంపిణీ



వరికోత మిషన్‌తో కోతలు మరింత సులువుగా మారిన దృశ్యం



దుక్కుల్లో రారాజుగా ట్రాక్టర్ల తోడ్పాటు

ఎమ్మిగనూరు: వ్యవసాయం, పాడీ పంటలు అన్నదాతకు రెండుకళ్ల లాంటివి. వ్యవసాయభూమితో పాటు పాడిపశువులు ఎక్కువగా ఉండేవారిని భూస్వామిగా పిలిచేవారు. నాడు వ్యవసాయం చేయాలంటే రైతింట దుక్కిదున్నే కాడెద్దులు, సాగు పనులు చేసేందుకు విరివిగా కూలీలు అందుబాటులో ఉండాలి. దీనివల్ల రైతులంతా సీజన్‌లో ఒకేసారి పంటసాగు చేయాలంటే ఇబ్బందిగా ఉండేది. దీనికి తోడు పశుగ్రాసం కొరత, నిర్వాహణ భారంతో కాడెద్దులను పోషించే శక్తి-సామర్థ్యాలు చాలామంది రైతుల్లో నేడు కనిపించడం లేదు. విజ్ఞాన శాస్త్రం విస్తరించటంతో వ్యవసాయంలో మార్పులొచ్చాయి. దీంతో రైతులు వ్యవసాయంలో యాంత్రీకరణకు ప్రాధాన్యతనిస్తున్నారు. దీంతో వ్యయప్రయాసలు తగ్గడమే కాకుండా, కూలీల కొరతను కూడా అధిగమించవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతులకు రుణాలిచ్చి, సబ్సిడీపై వ్యవసాయ యంత్రాలను అందించి ప్రోత్సహించింది. ప్రస్తుత కూటమీ ప్రభుత్వం ఇంతవరకూ ఆ దిశగా చర్యలు తీసుకోలేదు.

యాంత్రీకరణతో సాగు సులభం..

యాంత్రీకరణతో సాగును సులభతరతరం చేస్తుకుంటున్నారు. వ్యవసాయ పనుల్లో యంత్ర ప్రాధాన్యత పెరిగింది. దుక్కి దున్నటం మొదలు కోతలు, పంట నూర్పిడి వరకూ యంత్రాలను వినియోగిస్తున్నారు. ఖరీఫ్ పంటలో విత్తనసాగు(గొర్రు విత్తనం) మినహా ఎద్దుల ప్రాధాన్యతను తగ్గిస్తున్నారు. రోజుల్లో జరిగే పనులను గంటల్లోనే పూర్తి చేస్తున్నారు. దుక్కి దున్నేందుకు ట్రాక్టర్లు, మినీట్రాక్టర్లు, రోటావేటర్ల వినియోగం పెరిగింది. వరి నాట్లకు డ్రమ్ సీడర్లు వాడుకలోకి వచ్చాయి. కోత మిషన్లు, పంటనూర్పిడి యంత్రాలు వ్యవసాయాన్ని మరింత సులభతరం చేశాయి.

ప్రోత్సహించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం

వ్యవసాయరంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా యంత్ర ప్రాధాన్యతను గుర్తించిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతులకు రోటావేటర్లు, ఉల్లి విత్తన గొర్రులు, ట్రాక్టర్లను సబ్సిడీపై అందించింది. సహకార బ్యాంకులు పంటనూర్పిడి యంత్రాలు, కోత మిషన్లకు విరివిగా రుణాలు అందించాయి. భూసారా పరీక్షలు మొదలు సబ్సిడీ విత్తనాలు, ఎరువులు అందించటం, రైతు భరోసా కింద పెట్టుబడి సాయం అందించటం, పండిన పంటకు గిట్టుబాటు ధరలు లేకపోతే ప్రభుత్వమే కొనుగోలు చేయటం వంటి చర్యలతో గత వైఎస్సార్‌సీపీ రైతన్నకు అండగా నిలిచింది. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత వ్యవసాయ రంగంపై ఇంకా పూర్తిస్థాయి దృష్టి పెట్టలేదు. గత ప్రభుత్వ విధానాలు కొనసాగిస్తూ, యువరైతాంగాన్ని ప్రోత్సహించే చర్యలు చేపట్టాల్సి ఉంది.

సాగు పద్ధతుల్లో మార్పులొస్తున్నాయి



సాంప్రదాయ సాగుకు సాంకేతిక విజ్ఞాన్ని జోడించి రైతులు పంటలు పండిస్తున్నారు. సాగు పద్ధతుల్లో గతానికి నేటికీ చాలా మార్పులొచ్చాయి. సాగులో యంత్రాల వినియోగం పెరగటంతో వ్యవసాయాన్ని సులభతరం చేశాయి. కృషి విజ్ఞాన కేంద్రాలు, యువ శాస్త్రవేత్తల పరిశోధనలు, సహకారం రైతన్నకు మరింత ఊతమిస్తున్నాయి.

– మహ్మద్ ఖాద్రీ, ఏడీఏ

ప్రజా సమస్యలను వేగంగా పరిష్కరించండి

ఆదోని రూరల్: పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో వచ్చిన అర్జీలను అధికారులు నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించి అర్జీదారులను సంతృప్తి పరిచేలా చూడాలని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆదేశించారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించారు. డివిజన్‌లోని ఆయా మండలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వచ్చిన అర్జీలను ఆయన స్వీకరించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్లు వేణుసూర్య, శ్రీనివాసరాజు, డీఎల్‌డీపీఓ నూర్జహాన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పద్మజ, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ సత్యవతి, ఉప తహసీల్దార్ వలిబాషా తదితరులు పాల్గొన్నారు.



సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతి పత్రం అందజేస్తున్న డీఎస్ఎఫ్ నాయకులు

పాతభవనలోనే హాస్టల్‌ను ఏర్పాటు చేయాలి

పట్టణంలోని బీసీ బాలికల హాస్టల్‌ను బాలికల కళాశాలలోని పాత భవనంలోనే ఏర్పాటు చేయాలని డీఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ధణాపురం ఉదయ్‌లు సబ్‌కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

మారుకా మచ్చల పురుగును నివారించాలి

గోనెగండ్ల : ప్రస్తుతం కంది పంటకు కాయ తొలిచే పురుగు (మారుకా మచ్చల పురుగు) ఆశిస్తోందని, పురుగు నివారణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ సూచించారు. సోమవారం మండల కేంద్రం గోనెగండ్లలోని పంటలను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కంది పంటలో మారుకా మచ్చ పురుగును సరైన సమయంలో నివారించకపోతే కంది పంటకు పెద్ద ఎత్తున నష్టం వాటిల్లే అవకాశం ఉందన్నారు. ఈ పురుగు కందితో పాటు పెసర, మినుము, చిక్కుడు, వేరుశనగ, జీలుగ వంటి పైర్లకు కూడా ఆశిస్తుందని చెప్పారు. మారుకా మచ్చ పురుగు నివారణకు పూతకు ముందు వేప నూనె 3మిల్లీ లీటర్లు ఒక లీటర్ నీటికి కలుపుకొని పిచికారీ చేసుకోవాలని సూచించారు. తర్వాత పురుగు గమనిస్తే ఏమమేక్టిన్ బెంజోఏట్ 0.3 గ్రాములు లేదా నోవాలురాన్ 1మిల్లీ లీటర్ ఒక లీటర్ నీటికి కలుపుకొని 2శాతం బెల్లం ద్రావణంతో కలిపి పిచికారీ చేసుకుంటే మంచి ఫలితం పొందవచ్చునని తెలిపారు.

మెడికల్ కళాశాల పనులు పునఃప్రారంభించాలి



జాయింట్ కలెక్టర్ నవ్యకు వినతి పత్రం ఇస్తున్న ఆర్ఏవీఎఫ్ నాయకులు

ఆదోని సెంట్రల్/రూరల్: మెడికల్ కళాశాల నిర్మాణ పనులను పునఃప్రారంభించాలని రాయలసీమ అభ్యుదయ విద్యార్థి ఫేడరేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణ, ఖాజా కోరారు. సోమవారం కర్నూలులోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆర్ఏవీఎఫ్ ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర్ నవ్యకు వినతి పత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం మెడికల్ కళాశాలకు సిబ్బందిని కూడా నియమించిందని తెలిపారు. ఆదోనికి మెడికల్ కళాశాల వస్తుందని, సీట్లు కూడా దొరుకుతాయని ఎంతో మంది విద్యార్థులు సంతోషపడ్డారని తెలిపారు. తీరా కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాల పనులను అర్ధతరంగా నిలిపి వేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. వెనుకబడిన ప్రాంతమైన ఆదోనిలో మెడికల్ కళాశాల ప్రారంభమైయితే ఎంతోమంది పేద మధ్య తరగతి వారికి వైద్యం అందేది అన్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి పనులను తక్షణమే ప్రారంభించాలని వారు కోరారు.

వలస వెళ్లొద్దు పనులు కల్పిస్తాం

కోసిగి: గ్రామాలు వదిలి పనుల కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లవద్దని, గ్రామాల్లోనే ఉపాధి పనులు కల్పిస్తామని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఏపీడీ లోకేశ్వర్ అన్నారు. మండలంలో వలసలపై సోమవారం సాక్షి దిన పత్రికలో 'ఉపాధి కరువై..ఊరికి దూరమై' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. సాయంత్రం కోసిగిలోని కింది మారెమ్మవ్వ ఆలయ ప్రాంగణంలో కాలనీలోని రైతు కూలీలకు ఉపాధి పనులపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ బడికి వెళ్లే పిల్లలను కూడా తమ వెంట తీసుకెళ్లి వారి భవిష్యత్ నాశనం చేయవద్దన్నారు. పనులు కావాలని అడిగిన ప్రతి ఒక్కరికి ఉపాధి పనులు కల్పిస్తామని చెప్పారు. గ్రామంలోనే ఉంటూ ఉపాధి పనులు చేసుకోవాలని సూచించారు. ఏపీఓ చంద్రశేఖర్, టెక్నికల్ అసిస్టెంట్స్, ఫీల్డు అసిస్టెంట్స్‌లు ఉన్నారు.



రైతు కూలీలకు అవగాహన కల్పిస్తున్న ఏపీడీ లోకేశ్వర్

సాక్షి ఎఫెక్ట్

దెబ్బతిన్న పంటల పరిశీలన

కౌతాళం: తుపాను కారణంగా నదీతీర ప్రాంత్రాలో వరి పంటకు తీవ్ర నష్టం కల్గింది. పైరు పూర్తిగా నెల కొరిగింది. ఈ విషయంపై సోమవారం 'సాక్షి'లో 'వర్షం.. వరి రైతుకు నష్టం' అన్న శీర్షిక కథనం ప్రచురితం కావడంతో స్పందించిన అధికారులు నదీతీర గ్రామాల్లో సోమవారం సాయంత్రం పర్యటించి నష్టపోయిన పంటను పరిశీలించారు. మండలంలోని మేళిగనూరు, నదిచాగి గ్రామాల్లో తహసీలార్ మల్లికార్జునస్వామి, మండల వ్యవసాయాధికారి శేషాద్రి సిబ్బందితో పర్యటించి నష్టాన్ని అంచనా వేశారు. వారు మాట్లాడుతూ తుపాన్ వల్ల రైతులకు కలిగిన నష్టం గురించి నివేదిక తయారు చేసి ఉన్నత అధికారులు పంపిస్తామని తెలిపారు.



ఒరిగిపోయిన వరి పైరును పరిశీలిస్తున్న అధికారులు

కోసిగిలో చోరీ

కోసిగి : మండల కేంద్రంలోని దొరల చావిడి సమీపంలో ఉసేని ఇంట్లో పట్టపగలు గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనాని పాల్పడ్డారు. సోమవారం ఉసేని కుటుంబ సమేతంగా ఇంటికి తాళం వేసి పొలం పనులకు వెళ్లాడు. ఇదే అదునుగా చుసుకొని ఇంటి తాళాన్ని పగలగొట్టి ఇంట్లో జొరబడి ట్రంక్ పెట్టెలను పగలగొట్టారు. అందులో ఉన్న 3తులాలు బంగారు నగలు, రూ. 1.40లక్షలు నగదును అపహరించుకొని పోయారు. బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ చంద్రమోహన్ సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు.

ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ అందరి బాధ్యత

ఎమ్మిగనూరుటౌన్: ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ అందరి బాధ్యత అని యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేష్‌కుమార్ అన్నారు. సోమవారం స్థానిక వీవర్స్ కాలనీ హైస్కూల్‌లో యూటీఎఫ్ సర్ణోత్సవ మహాసభల్లో భాగంగా నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎస్టీఎఫ్ఎస్ఐ జెండాను ఆయన ఆవిష్కరించగా యూటీఎఫ్ జెండాను జిల్లా కార్యదర్శి నవీన్‌పాటి జెండాను ఆవిష్కరించారు. యూటీఫ్ రాష్ట్ర నాయకులు నాగమణి, ఎల్లప్ప, దేవపాల్, నరసింహులు,కౌలన్న, రామాంజినేయులు పాల్గొన్నారు.

కబ్జా చేసిన డాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

ఆదోని రూరల్: ఇంటి స్థలాన్ని కబ్జా చేసిన డాక్టర్ రవి కిరణ్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.అజయ్‌బాబు, పార్టీ సీనియర్ నాయకులు కె.లక్ష్మిరెడ్డి, పట్టణ కార్యదర్శి సుదర్శన్ డిమాండ్ చేశారు. సోమవారం వారు ఆక్రమణకు గురైన స్థలాన్ని పరిశీలించారు. నాయకులు షాబీర్‌బాషా, విజయ్, దస్తగిరి పాల్గొన్నారు.

132 మందికి వైద్య చికిత్సలు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని శివన్న నగర్‌లోని సరస్వతి శిశుమందిర్ ఆవరణలో సోమ వారం నవ భారత్ వెల్ఫేర్ సొసైటీ, జంకేర్ కామినేని ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత గుండె వైద్య శిబిరంలో 132మందికి వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి పాల్గొని ప్రసంగించారు.

పందుల సంచారాన్ని అరికట్టాలి

ఎమ్మిగనూరుటౌన్: పందుల సంచారాన్ని అరికట్టాలని సీపీఎం నాయకులు గోవిందు, సురేష్ కోరారు. పట్టణంలోని 24వ వార్డు లక్ష్మిపేటలో ఓ ఇంట్లో దాదాపు 100పందులను పెంచుతుండటంతో ఆ ప్రాంత ప్రజలకు వ్యాధులు ప్రబలుతున్నాయని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డికి వినతిపత్రం ఇచ్చారు.

పోలీస్ పెట్రోల్ బంకు ఏర్పాటుకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న డీఎస్పీ సోమన్న

ఆదోని అర్బన్: పట్టణంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పక్కన నూతనంగా పోలీసు వెల్ఫేర్ ఫండ్ ఆధ్వర్యంలో పెట్రోల్ బంకు ఏర్పాటుకు సోమవారం భూమిపూజ జరిగింది. డీఎస్పీ సోమన్న, టూటౌన్ సీఐ సూర్య మోహన్‌రావు పూజలు చేశారు. అనంతరం ప్రొక్లెయిన్ ద్వారా మట్టిని తీయించారు. డీఎస్పీ, సీఐలు మాట్లాడుతూ నాణ్యమైన పెట్రోల్‌ను ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. పెట్రోల్ నుంచి వచ్చే ప్రతి రూపాయి పోలీసు వెల్ఫేర్ ఫండ్‌కు వెళ్తుందన్నారు. 45 రోజుల్లో పెట్రోల్ బంకు నూతన నిర్మాణం పూర్తి అవుతుందన్నారు. ఎస్ఐ తిరుపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామసభను సద్వినియోగం చేసుకోండి

నందవరం : గ్రామ సభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాసులు సూచించారు. మంగళవారం మిట్టసోమపురం గ్రామంలో, 23న పూలచింత, 24న పెద్దకొత్తిలి, 25న జొహారాపురం గ్రామాలలో రీ సర్వేపై రెవెన్యూ గ్రామసభలు నిర్వహిస్తామని వివరించారు.

బాలికల హాస్టల్ ఏర్పాటు చేయాలి

మంత్రాలయం: మండలకేంద్రంలో బాలికల హాస్టల్‌ను ఏర్పాటు చేయాలని రాయలసీమ అభ్యుదయ విద్యార్థి (ఆర్‌ఏవీఎఫ్) జిల్లా అధ్యక్షుడు ఖాజా కృష్ణ కోరారు. సోమవారం కర్నూలులో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో డీఆర్‌ఓ చిరంజీవికి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ కరువు కాటకాలతో వలస బాటన పట్టే ప్రాంతాలు మంత్రాలయం నియోజకవర్గంలో అత్యధికంగా ఉన్నారన్నారు. కూలీలతో పాటు బడి చదువుకునే బాలికలు కుడా వెళ్తున్నారని, బాలికల హాస్టల్ ఏర్పాటు చేస్తే వారి వలసలు నివారించవచ్చునన్నారు.

పోరాటాలకు సిద్ధం కావాలి

కోసిగి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానలపై విద్యార్థులందరూ ఐక్యంగా ఉద్యోమాలకు సిద్ధం కావాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వీరేష్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో కలిసి ఏఐఎస్ఎఫ్ మహాసభల పోస్టర్లను విడుదల చేశారు. ఆదోని పట్టణంలో నవంబర్ నెల 12, 13వ తేదీల్లో 30వ ఏఐఎస్ఎఫ్ జిల్లా మహసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండల అధ్యక్షుడు విజయ్, మహిళా కన్వీనర్ వరలక్ష్మీ, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

నేడు హుండీ ఆదాయం లెక్కింపు

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయం హుండీ ఆదాయాన్ని లెక్కింపును మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు తెలిపారు. లెక్కింపులో పాల్గొనే ప్రతి ఒక్కరూ పంచ, ఉత్తరీయము (టవల్) తప్పక ధరించాలని సూచించారు.

సౌత్ జోన్ అథ్లెటిక్స్‌లో బంగారు పతకం



కోచ్‌తో మల్లికార్జున

కోసిగి: మండల పరిధిలోని కందుకూరు గ్రామానికి చెందిన కోసిగి రమేష్ కుమారుడు కోసిగి మల్లికార్జున గుంటూరులో జరిగిన 35వ సౌత్‌జోన్ అథ్లెటిక్స్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచాడు. ఆదోనిలో ఇంటర్ ఎంఎల్‌టీ ఫస్ట్‌ఇయర్ చదువుతున్న మల్లికార్జున ఈనెల 17 నుంచి 19వ తేదీ వరకు గుంటూరులోని నాగార్జున యూనివర్సిటీలో జరిగిన 35వ సౌత్ జోన్ నేషనల్ చాంపియన్ షిప్-2024 ఆధ్వర్యంలో నిర్వహించిన 5 కిలోమీటర్ల పరుగు పందెంలో పాల్గొన్నాడు. ఇందులో ప్రథమ స్థానంలో నిలిచి మెడల్ సాధించాడు. అలాగే ఈనెల 24 నుంచి 29వ తేదీ వరకు ఒడిశా రాష్ట్రంలోని భువనేశ్వర్‌లో జరిగే జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో పాల్గొననున్నాడు.

రాష్ట్రస్థాయి క్రీడాకారులకు ప్రోత్సాహం



దుస్తులు అందజేస్తున్న దృశ్యం

కౌతాళం: మండల పరిధిలోని బది నేహాల్ జెడ్పీ పాఠశాల 8వ తరగతి విద్యార్థిని రజియా, 7వ తరగతి విద్యార్థిని ఉష ఇటీవల జరిగిన జిల్లా స్థాయి ఖోఖో పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక య్యారు. వీరిని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు లక్ష్మిరెడ్డి తన వంతుగా ప్రోత్సహించడానికి దుస్తులను బహుమతిగా అందజేశారు. సోమవారం వ్యాయామ ఉపాధ్యాయుడు నర్సింహరాజు, ప్రధానోపాధ్యాయుడు హరినాథ్‌రావులు దుస్తులు అందించారు.

నేటి నుంచి ఆధార్ క్యాంపులు

పెద్దకడబూరు : మండలంలో మంగళవారం నుంచి ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ జయరాముడు సోమవారం తెలిపారు. మండలంలో కల్లుకుంట, నౌలేకల్లు, పెద్దకడబూరు, కంబదహాల్ గ్రామాలలో 4 ఆధార్ కేంద్రాలు ఉన్నాయన్నారు. ఈ క్యాంప్‌లలో కొత్తగా ఆధార్ నమోదు, బయోమెట్రిక్ అప్‌డేట్, అడ్రస్ మార్పిడి, ఫోన్ నంబర్ అప్‌డేట్, పుట్టిన తేదీ, పేరు మార్పిడి వంటివి చేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అక్రమ మద్యం స్వాధీనం

ఆదోని అర్బన్: పట్టణంలోని బోయగేరికి చెందిన భాగ్యలక్ష్మి అక్రమంగా మద్యం ప్యాకెట్లను తరలిస్తుండగా దాడులు చేసి పట్టుకున్నట్లు టూటౌన్ ఎస్ఐ తిరుపాల్ సోమవారం తెలిపారు. రైలులో నుంచి 240 టెట్రా ప్యాకెట్లను తీసుకొస్తుండగా రైతు బజారు సమీపంలో ఆమెను అదుపులోకి తీసుకొని, ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

పెద్దకడబూరు : మండల పరిధిలోని హనుమాపురం గ్రామ సమీపంలోని జగనన్న కాలనీ వద్ద సోమవారం పేకాట అడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ సమాచారం మేరకు సిబ్బందితో దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకొని, వారి నుంచి రూ. 33,600 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. యువత అక్రమ మద్యం, పేకాట, మట్కా వంటి వాటి జోలికి వెళ్లి తమ జీవితాలను నాశనం చేసుకోకూడదని సూచించారు.

ఎవరు తప్పు చేసినా ఉపేక్షించేది లేదు

ఆదోని అర్బన్: తన అనుచరులు గానీ, కూటమి నాయకులుగానీ తప్పు చేస్తే ఎంతవారినైనా ఉపేక్షించేది లేదని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి అన్నారు. సోమవారం తన క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జరిగిన అక్రమ రిజిస్ట్రేషన్‌ను 48 గంటల్లోనే డాక్యుమెంట్‌ను రద్దు చేయించామన్నారు. తాను ఎన్నికల్లో ఆదోని ప్రజలకు సేవ చేస్తానని, కబ్జాలు లేకుండా చేస్తానని మాట ఇచ్చానన్నారు. నాతోపాటు నా చుట్టుపక్కల ఉన్న వారు, కూటమి నాయకులు ఇందుకు కట్టుబడి ఉండాలన్నారు. అక్రమంగా రిజిస్టర్ చేసిన వారిపై చట్టబద్ధంగా చర్యలు ఉంటాయన్నారు.